క్లుప్తంగా

మృతుల కుటుంబీకులకు ఎమ్మెల్యే పరామర్శ



సుభాష్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు, పార్టీ శ్రేణులు

నిడదవోలు రూరల్: మండలంలోని తాడిమళ్ల గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుడు బయ్యే సుభాష్, అనారోగ్యంతో మృతిచెందిన దిరిసిమిల్లి కొండయ్య, కానుబోయిన త్రిమూర్తులు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు బుధవారం పరామర్శించారు. మృతిచెందిన వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఎమ్మెల్యే నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు, సర్పంచ్ బయ్యే రాధారాణి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మృతి చెందిన ఉపాధ్యాయుడి కుటుంబానికి సాయం



ఉపాధ్యాయుడి కుటుంబ సభ్యులకు సాయం అందజేస్తున్న నాయకులు

తాళ్లపూడి: మండలంలోని సూరయ్యపేట ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన నందివాడ ఈశ్వరరావు కుటుంబ సభ్యులకు ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశారు. జిల్లా అధ్యక్షుడు డి. దుర్గారావు ఆధ్వర్యంలో తాళ్లపూడి, గోపాలపురం, దేవరపల్లి, కొవ్వూరు, నిడదవోలు, పెరవలి మండలాలకు చెందిన ఉపాధ్యాయులు స్పందించి సమకూర్చిన రూ.33,000 అందజేశారు.

ఘనంగా పండిత సన్మాన సభ



సభలో పాల్గొన్న పండితులు

నిడదవోలు రూరల్: మండలంలోని తిమ్మరాజుపాలెంలో వేంచేసియున్న శ్రీ కోటసత్తెమ్మ ఆలయ ప్రాంగణంలో వేదశాస్త్ర పండిత సన్మాన సభ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం(శివ) ఆధ్వర్యంలో పండితులను ఘనంగా సన్మానించి నగదు పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్, చైర్మన్ దేవులపల్లి రామసుబ్బరాయశాస్త్రి, ధర్మకర్తల మండలి సభ్యులు గాజుల రంగారావు, మిద్దే శ్రీను, ఉర్ల వీరవెంకటలక్ష్మి, వద్దిరెడ్డి మహాలక్ష్మి, ప్రధాన అర్చకులు అప్పారావు శర్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణ సామాజిక బాధ్యత

ఉండ్రాజవరం: దోమల నివారణ అందరి సామాజిక బాధ్యత అని తణుకు మలేరియా సబ్ యూనిట్ అధికారి జి. వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలో కె.సావరం గ్రామంలో బుధవారం ఫ్రైడే డ్రైడేపై ఫీడ్ బ్యాక్, డెంగీ వ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆయన క్షేత్ర స్థాయిలో ఇళ్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మురుగు గుంటలు, నీళ్ళకుండీలు, టైర్లు, తాగి పడవేసిన కొబ్బరిబోండాలు, ప్లాస్టిక్ సామగ్రి, రుబ్బురోళ్లలో నిల్వ ఉన్న నీళ్లల్లో వైరస్ పెరిగి అక్కడ దోమలు మనిషిని కుట్టడం ద్వారా డెంగీ, మలేరియా, చికున్‌గున్యా లాంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జె.శ్రీనివాసు, గ్రామ సచివాలయ ఆరోగ్య కార్యదర్శి రత్నకుమారి, ఎం.శ్రీనివాసు, ఆశా కార్యకర్త సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఇష్టాష్టమి

- గ్రామగ్రామాన కృష్ణాష్టమి వేడుకలు
- చిన్నారుల వేషధారణలు, ఉట్టికొట్టే ఉత్సవాలతో సందడి



చాగల్లులో వేణుగోపాలస్వామి ఆలయం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

ఉండ్రాజవరం: మండలంలో కృష్ణాష్టమి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. తాడిపర్రులో కృష్ణుడి ఆలయం వద్ద ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు గ్రామాల్లో చిన్నారులు వేసిన కృష్ణుడు, గోపికల వేషధారణలు పలువురిని ఆకట్టుకున్నాయి. సాయంత్రం గుడి వద్ద ఉట్టికొట్టు కార్యక్రమంలో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చివటంలో గౌడ, శెట్టిబలిజ రామాలయం వద్ద ఉట్టి కొట్టిన వ్యక్తికి గ్రామ బంగారాన్ని నిర్వహకులు అందజేశారు. సూర్యారావుపాలెం, మోర్త, వేలివెన్ను గ్రామాల్లో కృష్ణుని విగ్రహాలను పల్లకిలో ఊరేగించారు.

తాళ్లపూడి: మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తాళ్లపూడిలోని రుక్మిణీ సత్యభామ సమేత మదనగోపాలస్వామి ఆలయంలో ఉదయం నుంచి ఆలయ అర్చకులు గోవర్ధనం రాజగోపాల్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారిని వివిధ పుష్పాలు, తులసీ దళాలతో అలంకరించారు. ఉట్టి కొట్టే కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు. అన్నదేవరపేటలోని బీసీ కాలనీలో, గజ్జరంలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నారు. వేగేశ్వరపురంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద, వడ్డీల రామాలయం వద్ద కృష్ణాష్టమి సందర్భంగా ఉత్సాహంగా యువకులు ఉట్టి కొట్టారు.

చాగల్లు: కృష్ణాష్టమి వేడుకలు మండలంలో బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లోని రామాలయాలు, వేణుగోపాలస్వామి కోవెలలు, యాదవ సంఘాల ఆధ్వర్యంలో వేడుకల్లో భాగంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి విష్ణు సహస్ర నామ పారాయణ చేసి, సాయంత్రం సంప్రదాయబద్ధంగా ఉట్టి కొట్టే వేడుక ఆయా ఆలయాల వద్ద ఉత్సాహంగా జరిగింది. యువతీ, యువకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పూజ కార్యక్రమాలు నిర్వహించారు. చాగల్లు ప్రధాన కూడలి వద్ద గల వేణుగోపాలస్వామి ఆలయంలో, సీతారామస్వామి ఆలయంలో, కనకదుర్గమ్మ ఆలయం వద్ద కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉట్టికొట్టే కార్యక్రమాలు నిర్వహించారు. ఊనగట్ల వేణుగోపాలస్వామి ఆలయం వద్ద, చాగల్లు కొత్తపేట రామాలయం, వేణుగోపాలస్వామి ఆలయం, నెలటూరు రాధాకృష్ణ ఆలయాల్లో ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. మార్కొండపాడు, మల్లవరం గ్రామాల్లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు.

నిడదవోలు రూరల్: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తాడిమళ్లలో వేంచేసియున్న శ్రీరుక్మిణి సత్యభామ సమేత శ్రీ రాజగోపాలస్వామిని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు, ఆయన తనయుడు వరుణ్‌సాయి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు, గ్రామ అధ్యక్షుడు కటికిరెడ్డి నారాయణరావు, ఎంపీటీసీ సభ్యుడు కె నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నల్లజర్ల: మండలంలో వివిధ గ్రామాలలో కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి. అనంతపల్లిలోని రుక్మిణీ సత్యభామ సమేత మదనగోపాలస్వామి ఆలయంలో ఉదయం నుంచి ఆలయ పూజారి డీవీ పాండురంగ శర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. రాత్రి 8 గంటలకు ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు. నల్లజర్లలోని వేణుగోపాలస్వామి ఆలయంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. సుభద్రపాలెంలో ఉన్న శ్రీకృష్ణుని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వివిధ గ్రామాలలో ఉట్టికొట్టే కార్యక్రమాలు జరిగాయి.

ఏర్పాట్లు పూర్తి

నిడదవోలు : పట్టణంలో వేంచేసియున్న రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీమదనగోపాల స్వామి వారి ఆలయంలో గురువారం నిర్వహించనున్న కృష్ణాష్టమి వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈవో నామా సూర్యప్రకాశరావు తెలిపారు. ఉదయం స్వామివారికి పంచామృత అభిషేకాలు, విశేష అలంకరణ, ఉదయం 10 గంటలకు మహిళా భక్తులు భగవద్గీత పారాయణ, అన్నమయ్య కీర్తనలు, ఈ నెల 8న ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. స్థానిక ఎమ్మెల్యే జి. శ్రీనివాసనాయుడు ముఖ్య అతిథిగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని ఈవో సూర్యప్రకాష్ తెలిపారు.



దేవరపల్లి బీసీ కాలనీలోని శ్రీకృష్ణుడి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

దేవరపల్లి: దేవరపల్లి బీసీ కాలనీలో గల శ్రీకృష్ణుడి ఆలయం వద్ద నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పాల్గొని పూజలు చేశారు. వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దుగ్గిన గంగాధర్, సొసైటీ అధ్యక్షుడు కవల శ్రీనివాస్, మండల సేవాదళ్ చైర్మన్ మాధవరపు వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కడిమి రాజు, గోపాలపురం సొసైటీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, పార్టీ నాయకులు పత్సా రాంగోపాల్, సిద్ధా సూర్యారావు, కుక్కల సత్యనారాయణ, టి మునిస్వామి పాల్గొన్నారు.

మెట్ట పంటలకు ఊపిరులూదిన వాన



దేవరపల్లిలో కురుస్తున్న వర్షం

దేవరపల్లి: వర్షాలు లేక దాదాపు రెండు నెలలుగా ఎండిపోతున్న మెట్ట పంటలకు బుధవారం సాయంత్రం కురిసిన వర్షం ఊపిరిపోసింది. సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు మెట్ట ప్రాంతంలో వర్షం కురిసింది. ఈ వర్షాలు ఉద్యానవన పంటలకు మేలు చేసినట్టు రైతులు తెలిపారు. సగటు వర్షపాతం కన్న తక్కువతో ఇప్పటికే పొలాలు బీడులుగా ఉన్నాయని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. ఈ వర్షం వల్ల పొలాలు దుక్కులు తయారవుతాయని రైతులు తెలిపారు. పొగాకు నారుమడులకు వర్షం ఉపయోగపడుతుందని అన్నారు.

అల్పపీడన ప్రభావంతో డివిజన్‌లో వర్షం

కొవ్వూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కొవ్వూరులో బుధవారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. వర్షానికి తోడు గాలులు వీయడంతో సుమారు అరగంటకు పైగా విద్యుత్ సరఫరా నిలిపి వేశారు. తాళ్లపూడి, చాగల్లు, నిడదవోలు, గోపాలపురం, దేవరపల్లి మండలాల్లోను ఓ మోస్తరు వర్షం పడింది. అల్పపీడన ప్రభావంతో రానున్న రెండు రోజులు పాటు వర్షాలు కురుస్తాయని ఇప్పటికే వాతావరణ శాఖ సూచించింది. సాయంత్రం నుంచి అన్నిచోట్లా వర్షం కురుస్తూనే ఉంది.

దేవరపల్లికి అగ్నిమాపక కేంద్రం

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- దీర్ఘకాల సమస్య పరిష్కారం

దేవరపల్లి: మెట్ట ప్రాంతంలోని గోపాలపురం నియోజకవర్గ ప్రజల చిరకాల కోరిక నెరవేరబోతోంది. నియోజకవర్గంలో ఎక్కడా అగ్నిమాపక కేంద్రం లేకపోవడంతో అగ్నిప్రమాదాల సమయంలో ప్రజలు తీవ్రంగా ఆస్తులను నష్టపోతున్నారు. ఈ ప్రాంతంలో పొగాకు సాగు ఎక్కువగా జరుగుతుండడంతో సీజన్‌లో పొగాకు క్యూరింగ్ సమయంలో అగ్నిప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ప్రమాదం జరిగితే సుమారు రూ.2 నుంచి 3 లక్షలు రైతులు నష్టపోతున్నారు. ప్రమాదం జరిగితే దాదాపు 35 కిలోమీటర్ల దూరంలో గల కొవ్వూరు, నిడదవోలు, భీమడోలు, తాడేపల్లిగూడెం ప్రాంతాల నుంచి అగ్నిమాపక వాహనాలు రావలసి వస్తోంది. వాహనాలు ప్రమాద స్థలానికి చేరుకొనేటప్పటికి బ్యారన్లు, గృహాలు బుగ్గవుతున్నాయి. దేవరపల్లి, గోపాలపురం మండలాలకు కొవ్వూరు, నిడదవోలు, నల్లజర్ల మండలానికి తాడేపల్లిగూడెం, ద్వారకాతిరుమల మండలానికి భీమడోలు అగ్నిమాపక కేంద్రం నుంచి వాహనాలు రావలసి ఉంది. సుమారు 25 సంవత్సరాలుగా అగ్నిమాపక కేంద్రం దేవరపల్లిలో ఏర్పాటు చేయడానికి ప్రజాప్రతినిధులు కృషిచేస్తూనే ఉన్నారు. 2011లో అగ్నిమాపక కేంద్రం మంజూరైనప్పటికీ నిధులు మంజూరు కాకపోవడంతో నిర్మాణం జరగలేదు. 2019 ఎన్నికల్లో దేవరపల్లిలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేస్తానని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ప్రజలకు హామీ ఇచ్చారు. దేవరపల్లిలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. అసెంబ్లీ సమావేశాల్లో పలుమార్లు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లారు. అగ్నిమాపక కేంద్రం నియోజకవర్గంలో ప్రధాన సమస్యగా ఉందని, మంజూరు చేయాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. దీంతో దేవరపల్లిలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు సీఎం జగన్ సానుకూలంగా స్పందించారు. ఇటీవల అగ్నిమాపక కేంద్రం మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్టు ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తెలిపారు. రామన్నపాలెం రోడ్డు వద్ద అగ్నిమాపక కేంద్రం నిర్మాణం చేస్తున్నట్టు ఆయన తెలిపారు. దీని కోసం ప్రభుత్వ స్థలం 20 సెంట్లు సేకరించినట్టు ఆయన తెలిపారు. అగ్నిమాపక కేంద్రం మంజూరు చేసిన సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి ఎమ్మెల్యే వెంకట్రావు కృతజ్ఞతలు తెలిపారు.



అగ్నిమాపక వాహనం (ఫైల్)

వైభవంగా విద్వత్ సభ



వేద విద్వత్ సభకు హాజరైన పండితులు

- వేద పండితులకు సత్కారం

నిడదవోలు : స్థానిక శ్రీమదనగోపాల స్వామివారి ఆలయంలో బుధవారం ఈవని రాంబ్రహ్మం అధ్యక్షతన శ్రీగాయత్రి వేదశాస్త్ర పరిషత్ 26వ వేద విద్వత్ సభను వైభవంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, చెన్నై, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి వేద పండితులు తరలివచ్చారు. 94 మంది ఘనపాఠిలు, 148 మంది క్రమాపాఠిలు, 44 మంది స్మార్త పండితులు, 50 మంది ఇతరులు సుమారు 350 మంది పండితులు లోక కల్యాణార్థం సుమారు మూడుగంటల పాటు వేద పఠనం నిర్వహించి, వేదా ఆశీస్సులు అందజేశారు. ఈ సభకు వచ్చిన వేద పండితులను నిడదవోలు శ్రీ గాయత్రి వేద పరిషత్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. శ్రీగాయత్రి వేద శాస్త్ర పరిషత్ అధ్యక్షుడు ఈవీ అప్పారావు, కార్యదర్శి జి.హనుమ సుబ్రహ్మణ్యం, కోశాధికారి జీఎస్ఎన్ ప్రకాశం, సొంభట్ల చంద్రశేఖరశాస్త్రి, నడిపల్లి ఆంజనేయులు, మైలవరపు కామేశ్వర ప్రసాద్, తుట్టగుంట బ్రదర్స్, టి.సురేష్ శాస్త్రి, పొన్నా సుబ్రహ్మణ్యశర్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు భగవద్గీత పోటీలు

సీటీఆర్ఐ: భగవద్గీత పఠనం వల్ల మేధాశక్తి పెరుగుతుందని శ్రీకృష్ణ చైతన్య ఆశ్రమం ఇన్‌చార్జి శ్రీపాద హరిదాస్ బ్రహ్మచారి అన్నారు. శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా ఆర్యాపురం శ్రీకృష్ణ చైతన్య ఆశ్రమంలోని శ్రీరాధాకృష్ణ మందిరంలో బుధవారం పాఠశాలల విద్యార్థులకు భగవద్గీత పోటీలు నిర్వహించారు. విజేతలకు శ్రీభక్తి కంకణ బనమహారాజ్, ఆశ్రమ ఇన్‌చార్జి శ్రీపాద హరిదాస్ బ్రహ్మచారి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. న్యాయ నిర్ణేతలుగా సురేష్ దాస్ బ్రహ్మచారి, పిచ్చుక వెంకట రాంబాబు వ్యవహరించారు. కార్యక్రమంలో భారత వికాస్ పరిషత్ పూర్వ అధ్యక్షుడు పీవీఎస్.కృష్ణారావు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న శ్రీపాద హరిదాసు బ్రహ్మచారి

ఎనిమిది మందికి జరిమానా

పెదపూడి: ప్రభుత్వ ఉద్యోగి విధులకు ఆటంకం కలిగించిన ఎనిమిది మందికి ఒక్కొక్కరికి రూ.2 వేలు చొప్పున జరిమానా లేక ఒక నెల జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది. ఎస్సై పి.వాసు బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. 2019 అక్టోబర్ 22 పుట్టకొండలో రోడ్డుపై ఆక్రమణలను కాకినాడ ఆర్‌అండ్‌బీ ఏఈ లోవరాజు తొలగిస్తుండగా ఎనిమిది మంది ఆటంకం కలిగించారు. దీనిపై లోవరాజు పెదపూడి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై లక్ష్మీకాంతం కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం కాకినాడ ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి వి.లీలా శ్యామ్‌సుందరి పైవిధంగా తీర్పు ఇచ్చారు.

ప్రజలకు సంపూర్ణ సేవలు

నిడదవోలు రూరల్: ప్రజలకు సంపూర్ణ సేవలందించడం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టి అమలుచేస్తున్న నవరత్నాల పథకాలను అందరికీ చేర్చేందుకు వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలోని పెండ్యాల గ్రామంలో గడపగడపకూ ప్రభుత్వం కార్యక్రమాన్ని నాలుగోరోజు బుధవారం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కారింకి అన్నవరం, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు ఉప్పులూరి రామకృష్ణాంజనేయులు ఆధ్వర్యంలో ఒక వైపు వర్షం కురుస్తున్నా ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, గ్రామంలో నాలుగున్నరేళ్లుగా చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించి బుక్‌లెట్‌లను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగనన్నపై ప్రతి ఒక్కరూ నమ్మకం ఉంచితే రాష్ట్రం అభివృద్ధి చెందడంతో పాటు పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు మంచి చేసే వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ప్రజలంతా మద్దతు పలకాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బైర్రాజు సత్యరాజు, నాయుడు సత్యనారాయణ, పేరిచర్ల నాగరాజు, వాకా సూర్యనారాయణ, సరిపల్లి నూకరాజు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



పెండ్యాలలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

బాలాజీపేట రోడ్డుకు మోక్షం

- చురుకుగా మరమ్మతులు
- వాహన చోదకుల హర్షం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): నగరపాలకసంస్థ పరిధిలోని 16వ డివిజన్ బాలాజీపేట రోడ్డుకు మోక్షం లభించింది. రూ.7.80 లక్షలతో నగరపాలకసంస్థ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి చేసి రోడ్డుకు మరమ్మతులు చేపడుతున్నారు. దీనిపై వాహనచోదకులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఈ రోడ్డులో భారీ వాహనాలు యథేచ్ఛగా తిరగడంతో గోతులు మరింత పెద్దగా మారి ప్రమాదకరంగా తయారయ్యాయి. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు ఆందోళన చెందారు.

వర్షం కురిస్తే..

వర్షం కురిస్తే చాలు బాలాజీపేట రోడ్డు గోతులమయంగా మారేది. రోడ్డు వేసిన నేల పొలంబీడు భూములు కావడంతో గతంలో తరచూ గోతులు పడుతుండేవి. ఈ నేపథ్యంలో నగరపాలక సంస్థ అధికారులు గోతులకు శాశ్వత పరిష్కారంగా ఇనుప ఊచల చట్రంతో సీసీ రోడ్డు కింద వేస్తున్నారు. సీసీ రోడ్డు వేసిన ప్రాంతాలలో రోడ్డు బాగానే ఉంది. మిగిలిన ప్రాంతాలలో మాత్రం రోడ్డు గోతులుగా మారుతోంది. ఇప్పుడు బీటీ రోడ్డుపై పడిన గోతులను ఇనుప చట్రాలు వేసి ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో సీసీ రోడ్డు నిర్మిస్తున్నారు. సుమారు రూ.7.80 లక్షలతో మరమ్మతులు చేపడుతున్నామని, నాణ్యతా ప్రమాణాలు పూర్తిస్థాయిలో పాటిస్తున్నామని నగరపాలకసంస్థ ఏఈ శ్రీధర్ 'సాక్షి'కి తెలిపారు.

భారీ వాహనాలే కారణం!

బాలాజీపేట రోడ్డులో తరచూ ఇసుక లోడుతో భారీ వాహనాలు తిరగడం వల్లనే రోడ్డు ధ్వంసమైపోతోంది. సీసీ రోడ్లు వేసినప్పటికీ భారీ వాహనాల రాకపోకలతో అధ్వానంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో భారీ వాహనాల రాకపై ఆంక్షలు విధించాలని స్థానికులు కోరుతున్నారు.



బాలాజీపేట రోడ్డులో జరుగుతున్న మరమ్మతులు

గణపతి నవరాత్ర ఉత్సవాలకు రాట ముహూర్తం



ఉత్సవాలను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ



రాటకు పూజలు చేస్తున్న యూత్ సభ్యులు

నిడదవోలు : స్థానిక యాదవుల వీధిలో గణపతి నవరాత్ర ఉత్సవాలకు మంగళవారం ఉదయం రాట ముహూర్తం జరిగింది. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ కొబ్బరికాయ కొట్టి ఉత్సవాలను ప్రారంభించారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్స్ గంగుల వెంకటలక్ష్మి, ఎలాగడ బాలరాజు, కౌన్సిలర్లు కామిశెట్టి సత్యనారాయణ, గోపిరెడ్డి శ్రీనివాస్, షేక్ వజీరుద్దీన్, ఉసురుమర్తి జాన్‌బాబు, అరుగొల్లు వేంకటేశ్వరావు, కొత్తపల్లి సుప్రియ పాల్గొన్నారు.

వినాయక చవితి ఉత్సవాలకు రాట ముహూర్తం

కొవ్వూరు: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలో మెరకవీధి రౌండ్ రామాలయం యూత్ ఆధ్వర్యంలో నిర్వహించే ఉత్సవాలకు బుధవారం రాట ముహూర్తం చేశారు. గణనాథుడికి పూజలు చేసి రాట పాతారు. గడిచిన 19 ఏళ్ల నుంచి భారీ ఎత్తున ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఉత్సవ కమిటీ సభ్యులు నగళ్లపాటి శ్రీనివాస్, పెరుమళ్ల ఉమా మహేశ్వరరావు, కొయ్యల భాస్కరరావు, ఆవుల వాసు, మురమళ్ల వెంకటేశ్వరరావు, మురుకొండ శ్రీనివాసరావు, అత్తిలి పండు, గడదాసు శివ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ నెల 18వ తేదీ నుంచి ఉత్సవాలు అట్టహాసంగా ప్రారంభం కానున్నట్లు నిర్వాహకులు తెలిపారు.